క్లుప్తంగా

సమాజ సేవలో వాసవీ క్లబ్



రైతులకు పవర్ స్ప్రేయర్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

నాగులుప్పలపాడు: సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే పనులు చేయడంలోనే ఆనందం ఉందని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ వైస్ ప్రెసిడెంట్ తుమ్మల సాయి నాగభూషణం అన్నారు. డాన్ టూ డస్క్ 2023 ఏడాదికిగానూ జూన్ 1, 2 తేదీల్లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన జై జవాన్-జై కిసాన్ అంశంలో భాగంగా ఉప్పుగుండూరు క్లబ్ తరఫున అర్హులైన రైతులకు శనివారం పవర్ స్ప్రేయర్లు అందజేశారు. పేదలకు దుస్తులు దానం చేయడంతో పాటు మరికొంతమందికి నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే పెదగంజాం రోడ్డులో ప్రయాణికుల సౌకర్యార్థం 4 సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

● అధికారులకు తప్పిన ప్రాణాపాయం



డివైడర్‌పైకి ఎక్కిన చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ కారు

చీమకుర్తి: ఒంగోలు నుంచి చీమకుర్తి వస్తున్న కారును పేర్నమిట్ట వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. కారులో చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, మేనేజర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రయాణిస్తున్నారు. వారంతా స్వల్పగాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆగిన బైక్‌ను ఢీకొని వృద్ధునికి గాయాలు

బల్లికురవ: రోడ్డు క్రాసింగ్‌లో ఆగి ఉన్న బైకును టీవీఎస్ ఎక్సెల్‌పై వెళుతూ ఢీ కొట్టడంతో ఓ వృద్ధుడు గాయాల పాలయ్యాడు. ఈ ఘటన శనివారం మేదరమెట్ల-నార్కెట్‌పల్లి నామ్ రహదారిలో కొప్పరపాడు గ్రామ సమీపంలోని వినుకొండ క్రాస్ రోడ్ వద్ద జరిగింది. కూకట్లపల్లి యానాది సంఘానికి చెందిన యండ్లా రత్నం, గ్రామం నుంచి మోపెడ్‌పై సంతమాగులూరు అడ్డరోడ్డుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.



అమ్మనబ్రోలులో పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, ఎంపీపీ, నాయకులు



లింగంగుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పక్కన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నాయకులు



చింతాయగారిపాలెంలో పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీవో

జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- మద్దిపాడు మండలం లింగంగుంట, ఏడుగుండ్లపాడులో జగనన్న సురక్ష కార్యక్రమాలు
- లింగంగుంటలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

మద్దిపాడు: కులం, మతం, ప్రాంతం, పార్టీ అనే విభేదాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే తలంపుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. మండలంలోని లింగంగుంట, ఏడుగుండ్లపాడు గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. లింగంగుంటలో ఎమ్మెల్యే టీజేఆర్‌తో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ మేలు చేయాలన్న లక్ష్యంతో నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి వలంటీర్లు, సచివాలయాల ద్వారా ఇళ్ల వద్దకే అందిస్తున్నారన్నారు. గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటు చేసి గతంలో మాదిరిగా రోజుల తరబడి మండల కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన అవసరం లేకుండా చేశారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పథకాలు పెండింగ్‌లో ఉన్న వారికి కూడా అందిస్తున్నారన్నారు. ప్రజలకు ఇంత మేలు చేస్తున్న ముఖ్యమంత్రిని ఇంతకు ముందు ఎవరైనా చూశారా అని ఎమ్మెల్యే టీజేఆర్ ప్రశ్నించారు. రైతులకు మేలు జరిగే విధంగా ఆర్‌బీకేలు తీసుకొచ్చి వ్యవసాయానికి కావాల్సినవన్నీ అందిస్తున్నారన్నారు. ఏదైనా ప్రకృతి విపత్తులు సంభవించి పంట నష్టపోతే వారికి అదే సీజన్‌లో పంటల బీమా ద్వారా నష్టపరిహారం అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు సుఖంగా ఉండాలని ఇన్ని పథకాల ద్వారా జగనన్న మేలు చేస్తుంటే.. చంద్రబాబు తన కుహనా రాజకీయాలతో కారుకూతలు కూస్తూ తన పార్టీ నాయకులతో కూడా విమర్శలు చేయిస్తున్నాడని దుయ్యబట్టారు. వలంటీర్లు బస్తాలు మోయడానికా అంటూ చులకనగా మాట్లాడాడని మండిపడ్డారు. ఆ వలంటీర్లే కరోనా సమయంలో గ్రామానికి రక్షణగా నిలిచి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేశారని గుర్తుచేశారు. చంద్రబాబు తనకు అవకాశం ఇస్తే రాష్ట్రం రూపురేఖలు మారుస్తానంటున్నాడని, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఒక్క స్కూలునైనా బాగు చేయించాడా అని ప్రశ్నించారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అంటూ మాట్లాడిన చంద్రబాబును ప్రజలు గమనిస్తున్నారని, గత ప్రభుత్వానికి-ప్రస్తుత జగన్ ప్రభుత్వానికి ఉన్న తేడాను గుర్తించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అన్నారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి : జంకె వెంకటరెడ్డి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ తాను టీడీపీ ప్రభుత్వంలో కూడా ఎమ్మెల్యేగా పనిచేశానని, కానీ, ప్రజలకు సేవ చేశానన్న సంతృప్తి దక్కలేదని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలకు జరుగుతున్న మేలు చూస్తుంటే ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నానని, ప్రజల కోరిక కూడా అదేనని అన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలు, ఒక ఎంపీ సీటును వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుచుకునేలా పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలందరూ మంచి జరుగుతుందా.. లేదా..? అనేది మాత్రమే ప్రామాణికంగా తీసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు డీటీ జ్యోతి, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, లింగంగుంట సర్పంచ్ శైలజ జనార్దన్, నాయకులు గట్టినేని అయ్యన్న, జేసీఎస్ మండల కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, మోరబోయిన సంజీవరావు, గుద్ద పాతల రవి, పోతినేని శ్రీనివాసరావు, షేక్ బాబు, మందా చిన్న, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, ఎంపీటీసీ సభ్యులు బొమ్మల ప్రభుదాసు, పైనం ప్రభాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో...

చీమకుర్తి: సంతనూతలపాడు మండల పరిధిలోని రుద్రవరం, బొడ్డువారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంకేతిక కారణాల వలన సంక్షేమ పథకాలు ఆగిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం తీసుకొచ్చారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హత కలిగిన వారంతా సంక్షేమ పథకాలు పొందడానికి మరో అవకాశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, ఓరుగంటి బలరామిరెడ్డి, తానిపర్తి వెంకటరెడ్డి, నల్లూరి భాస్కర్‌రావు, బొడ్డు రామారావు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే జగనన్న సురక్ష : ఎంపీపీ పల్లపోలు

ఒంగోలు రూరల్: ప్రజా సంక్షేమం కోసమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి అన్నారు. ఒంగోలు రూరల్ మండలంలోని చింతాయగారిపాలెం గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ సర్పంచ్ నాయుడు శ్రీరాములు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఒంగోలు మండల తహసీల్దార్ పసుపులేటి మురళి, ఎంపీడీవో పి.అజిత పాల్గొని మాట్లాడారు. చింతాయగారిపాలెంలో కుల ధ్రువీకరణ పత్రాలు 497, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 510, రైసు కార్డు విభజన 5, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ 1, మ్యారేజ్ సర్టిఫికెట్ 2 జారీ చేశారు. ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, ఏవో శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి స్వప్న, వీఆర్వో జగదీష్‌బాబు, గృహసారథులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా వీవోఏలు, ఏపీవో, ఏపీఎంలు పాల్గొన్నారు.

ముక్తినూతలపాడులో...

ముక్తినూతలపాడులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుల, మత, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా ప్రజలకు అన్ని పథకాలు అందాలన్నదే సీఎం లక్ష్యమని తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.వీరాంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్ ఫిరోజ్‌బాషా, ఆర్‌వో ఎల్. విజయభాస్కర్‌బాబు, డీఈ పద్మజ, గ్రామ అడ్మిన్ విజయలక్ష్మి, వీఆర్వో అంకిరెడ్డి పాల్గొన్నారు.



ముక్తినూతలపాడులో అందజేస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, రాయపాటి



ఈతముక్కల సచివాలయం-1 పరిధిలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న రవీంద్రరెడ్డి

అమ్మనబ్రోలులో పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే టీజేఆర్...

నాగులుప్పలపాడు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా అందే పత్రాలను ఉచితంగానే అందించనున్నట్లు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమ్మనబ్రోలు సచివాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్షలో భాగంగా గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందించే 11 రకాల సేవలను ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు వివిధ అర్హత పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, లిడ్‌క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, గ్రామ సర్పంచ్ బత్తుల రవీన, కూనం పూర్ణచంద్రరావు, కోయి హనుమయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల, అల్లూరు పంచాయతీల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభల్లో మండల సచివాలయ కన్వీనర్ ఆళ్ల రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను వారం రోజుల్లో పంపిణీ చేయడం ప్రజలకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. అల్లూరు-1 సచివాలయం పరిధిలో మొత్తం 984 గృహాలుండగా, 800 గృహాలను సర్వే చేశారు. 220 మందికి టోకెన్లు అందజేశారు. 209 మంది సమస్యలు పరిష్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈతముక్కల-1 సచివాలయం పరిధిలో 149 సర్టిఫికెట్లు అవసరమని గుర్తించి 135 మందికి పంపిణీ చేశారు. మిగతా అర్జీలను ఆగస్టు 1వ తేదీ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, మండల ప్రత్యేక అధికారి అర్చన, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, అల్లూరు సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, మేడికొండ సునీత, బండారు సుబ్బారావు, ఐపీ రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

24 మందికి ప్రోత్సాహకాలు



బల్లికురవలో మెటీరియల్ అందజేస్తున్న ఎంఈవో విద్యా వికాస్

బల్లికురవ: ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించమే తమ ధ్యేయమని మార్టూరు విద్యా వికాస్ అధ్యక్షుడు వివేకానంద కృష్ణమూర్తి అన్నారు. శనివారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల్లో అత్యధిక మార్కులతో ప్రతిభ చూపిన 24 మంది విద్యార్థులకు జీకే బుక్స్, ఎస్ఎంఎస్ మెటీరియల్ అందజేశారు. ఎంఈవో కె. రమేశ్‌బాబు, పాఠశాల హెచ్ఎం హనుమంతరావు, విద్యా వికాస్ కో ఆర్డినేటర్లు జి. కోటేశ్వరరావు, జి. వెంకట్ పాల్గొన్నారు.

వాహనదారులకు చట్టంపై అవగాహన

చినగంజాం: నో యాక్సిడెంట్ డే పురస్కరించుకొని వాహన దారులకు వాహన చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని చినగంజాం ఎస్ఐ కె. సురేష్ శనివారం నిర్వహించారు. 25 కేసులు నమోదు చేసి రూ. 3500 నగదు జరిమానా వసూలు చేశారు.

నర్సరీల నిర్వహణలో జాగ్రత్త

చినగంజాం: నర్సరీల నిర్వాహణ విషయంలో సిబ్బంది పూర్తి స్థాయిలో శ్రద్ధ తీసుకోవాలని ఉపాధి హామీ పీడీ శంకర్ నాయక్ అన్నారు. శనివారం చినగంజాం, పల్లెపాలెంలోని నర్సరీలను పరిశీలించారు. జేఈ సురేష్. ఎ. సుదర్శన్, నర్సరీల నిర్వాహకులు సీహెచ్ కళ్యాణ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చినగంజాం: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న భోజనం విషయంలో ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకొని నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని మండల ప్రత్యేకాధికారి సీహెచ్ హనుమంతరావు, తహసీల్దార్ పి. పార్వతి సూచించారు. శనివారం కొత్తపాలెం పంచాయతీ మూలగాని వారిపాలెం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పంపిణీ పరిశీలించారు. సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు



మద్దిపాడు పీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

ఒంగోలు అర్బన్: జాతీయ డాక్టర్స్ డేని నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వేడుకలు నిర్వహించి ప్రజలకు అందించాల్సిన మెరుగైన వైద్య సేవలపై చర్చించారు. మంచి సేవలందించిన వైద్యులకు చిరు సత్కారాలు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ఇతర డాక్టర్లు తిరుమలరావు, బాలాజీనాయక్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

- రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రకాష్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డేని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురుని సత్కరించారు. రక్తదాన శిబిరంలో 22 యూనిట్ల రక్తాన్ని దాతలు అందజేశారు. సీఏ ఒంగోలు చాప్టర్ చైర్మన్ చైతన్య, కిషోర్, డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, జాగర్లమూడి కృష్ణారావు, పోలవరపు హరీష్, డాక్టర్ కొత్త మురళీధర్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు నరసింహారావు, శ్రీరాములురెడ్డి, రామకృష్ణ, అడపా వెంకటేశ్వర్లు, నోబుల్ చెరియన్ తదితరులు పాల్గొన్నారు.
- ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి డాక్టర్లకు తినిపించారు. మెరుగైన సేవలందించిన డాక్టర్లను సత్కరించారు. సీఓఓ డాక్టర్ హరికుమార్‌రెడ్డి, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.
- కిమ్స్ హాస్పిటల్లో కేక్ కట్ చేసి వైద్యులను సత్కరించారు. హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, డాక్టర్ శ్రీహరిరెడ్డి, కె.అంకిరెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.
- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో డాక్టర్స్ డే సందర్భంగా సభ్యులు కేక్ కట్ చేశారు. పలువురు డాక్టర్లను సత్కరించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు చేబ్రోలు నాగేశ్వరరావు, జాలాది మణిబాబు, రంగనాథ్, కృష్ణ, వీరయ్యచౌదరి, శివ సీతారామయ్య, నాగయ్యనాయుడు, సుధాకర్, మహేష్, సుభాష్, సందీప్, జైకిషోర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మద్దిపాడు పీహెచ్‌సీలో...

మద్దిపాడు: స్థానిక పీహెచ్‌సీలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి డాక్టర్లు మానస, ఆనందమోహన్, వినీల చౌదరి, జగదీష్‌లను వైద్యసిబ్బంది ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించారు. సీహెచ్‌వో రజితకుమారి, ఎంపీహెచ్ఎస్ బాలకోటయ్య, నాగేశ్వరరావు, పద్మావతి, సీతమ్మ, విలేజ్ హెల్త్ క్లినిక్ సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో డాక్టర్లు, సీఏలను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్సీ,ఎస్టీలకు సత్వర న్యాయం చేయాలి



జంకెను సన్మానిస్తున్న సభ్యులు

మార్కాపురం టౌన్: ఎస్సీ, ఎస్టీలకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. శనివారం మార్కాపురంలోని ఆయన స్వగృహంలో ఇటీవల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన బూదాల గురవయ్య, ఆదిమూలపు అనీల్‌రాజు, నగేష్, అరవింద్ తదితరులు జంకెను కలిసి సన్మానించారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

చినగంజాం: కొత్తపాలెం పంచాయతీ మూలగాని వారి పాలెం గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి వార్షికోత్సవ పూజలు శనివారం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు, అన్నదానం చేశారు.

రక్తదానం విలువైనది

చీరాల అర్బన్: రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చని చీరాల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుభాషిణి అన్నారు. రోటరీ సామాజిక భవనంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో రక్తదాన శిబిరాన్ని చీఫ్ మేనేజర్ వి.రామానాయుడు, క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఐ.బాబూరావు ప్రారంభించారు. 16 మంది రక్తదానం చేశారు. మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, చీరాల కృష్ణమూర్తి, బండారుపల్లి హేమంత్‌కుమార్, డీవీ సురేష్, జీవై ప్రసాద్, గుర్రం రాఘవరావు, వలివేటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు రాచపూడి కాపురస్తుడు ప్రస్తుతం ఒంగోలు నివాసం రావి నాగభూషణం గారి కుమారుడు శ్రీనివాసరావు గారి సంజాయిషీ మేరకు తెలియజేయునది ఏమనగా.

బాపట్ల సబ్ కోర్టుఫైల్ O.S. 37/1947 నంబరు దావాలో ఒంగోలు కాపురస్తుడు నవులూరి పురుషోత్తం గారి కుమారుడు వెంకట రమణయ్య గారు తన వాటాకు రాబడిన స్థిరాస్తులలో కొన్నింటిని తన కుటుంబ ఖర్చులకున్నూ, ఋణములు తీర్చుకొనుటకున్నూ అమ్మజూపగా మా క్లయింటు మాతా మహుడైన కొమర్నేని వెంకటేశ్వర్లు గారు కాలోచిత ధరల ప్రకారం కొనుగోలుకు అంగీకరించి క్రయధనము చెల్లించి తే.29.08.1962 ది.న విక్రయ అగ్రిమెంటు Conclude కాబడినది. అందుకు నిదర్శనముగా అదే తేదిన వెంకట రమణయ్య గారు క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తులను కొమర్నేని వెంకటేశ్వర్లు గారికి గాని వారి వారసులు గాని కోరినప్పుడు వారి ఖర్చులతో విక్రయము రిజిష్టర్ చేయుటకు అంగీకరించి విక్రయ పత్రము / ఖరారు అగ్రిమెంటు ససాక్షికముగా కొమర్నేని వెంకటేశ్వర్లు గారి పేర వ్రాయించి యిచ్చి యున్నారు. దరిమిలా కొమర్నేని వెంకటేశ్వర్లు గారు తే.29.08.1962 ది. గల పత్రము ద్వారా రాబడిన ఆస్తులను మంచి వ్యక్తిత్వముతో తన కుమార్తె రావి సుబ్బరావమ్మ గారి పేర వీలునామా వ్రాయించి చెందజేసియున్నారు. కొమర్నేని వెంకటేశ్వర్లు గారి మరణానంతరం ఆయన తన కుమార్తెకు వ్రాసిన వీలునామా అమలులోనికి రాబడినది. దరిమిలా సుబ్బరావమ్మ గారు తన తండ్రి గారు వ్రాసిన వీలునామా ద్వారా తే.29.08.1962 ది. పత్రముల ద్వారా తనకు సంక్రమించిన ఆస్తులను తన కుమారుడైన మా క్లయింటుకు చెందజేయుచూ, వీలునామా వ్రాయించి యిచ్చి యున్నది. ఆమె తదనంతరం మా క్లయింటు ఆమె తాలూకు పత్రములు, దస్తావేజులు పరిశీలించి ఆమె వ్రాసిన వీలునామా అమలు లోనికి రాబడినందున తే.29.08.1962ది. పత్రము ద్వారా నవులూరి వెంకట రమణయ్య గారు మా క్లయింటు మాతామహుని పేర వ్రాయించిన విక్రయ పత్రము / అగ్రిమెంటు మరియు సుబ్బరావమ్మ గారి యితర దస్తావేజులను పత్రములను పరిశీలించి తే.29.08.1962ది. గల పత్రము, వీలునామాలు నవులూరి వెంకట రమణయ్య గారి వారసులు అందుబాటులో లేనందున 2022 సం॥ ప్రాంతములో వారికి చూపించగా తే.29.08.1962ది. గల పత్రమును మరియు వీలునామాలు తమ ఎరికలో ఉన్నవని ఫైనల్ డిక్రీ engross కాలేదని కోర్టు ద్వారా స్వాధీనము కాలేదని పూర్తి అయిన వెంటనే రిజిష్టర్ చేసెదమని చెప్పియున్నారు. మా క్లయింటుకు తెలియుటలో తే.29.08.1962ది. గల నవులూరి రమణయ్య గారు వ్రాయించి యిచ్చిన పత్రములు మభ్యపెట్టి ఆయన వారసులు అక్రమంగా మా క్లయింటుకు తెలియకుండా కొన్ని ఆస్తులను లాలూచీగా అన్యాక్రాంతము చేయుచున్నట్లు తెలియవచ్చినందున మా క్లయింటు విక్రయము రిజిష్టర్ చేయించుకొనుటకు సిద్ధముగా ఉన్నట్లు లాయర్ ద్వారా నోటీసు పంపగా తీసుకొని ఎటువంటి సమాధానము యిచ్చి యుండలేదు. మా క్లయింటు తే.29.08.1962ది.న నవులూరి వెంకట రమణయ్య గారు వ్రాయించి యిచ్చిన పత్రము ప్రకారము రిజిష్టర్ చేసి స్వాధీన పరచవలసినదిగా ఒంగోలు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినారని, దావా తీర్మానము అయ్యే వరకు వెంకటరమణయ్య గారి వారసులు ఎలాంటి అన్యాక్రాంతములు చేయకుండా ఉండగలందులకు ఇంజక్షన్ పిటీషన్ సహదాఖలు చేసియున్నారు. షెడ్యూల్ ఆస్తుల గురించి ఎలాంటి అన్యాక్రాంతములు జరిగినను అవి మా క్లయింటును బద్ధపరచవు.

షెడ్యూల్ : 1. కరవది Sy.No.283, AC 0.87Cts, 2. పేర్నమిట్ట Sy.No.292, AC 0.45 cts, Sy.No.370/2, AC 1.60 cts, Sy.No.86 AC 1.55 Cts. 3. మండువ వారిపాలెం Sy.No.494, AC 1.43 Cts, 4. వెల్లంపల్లి Sy.No.124, AC 1.68 Cts, 5. నేలటూరు Sy.No.449, AC. 1.40 Cts, 6. అద్దంకి Sy.No. 566, AC 0.87 Cts, 7. ఒంగోలు Sy.No.158, AC 0.71 1/2 Cts, Sy.No.186, 187/1, 0.80 1/2 Cts, Sy.No.287/1, 0.30 Cts, T.S.No.366 Residential House, T.S.No.464 0.48 1/2 Cts, T.S.No.706/1, 0.97 Cts, T.S.No.424 0.57 Cts, 8. మంగమూరు Sy.No.2 AC 2.30 1/2 Cts.

ఇట్లు:

సీతారాంపురం, ఒంగోలు — ముదివర్తి రాఘవరావు, AP 442/1979

తేది: 01.07.2023 — పెద్దూరి వసుంధర, AP 2163/2010

అడ్వకేట్స్, ఒంగోలు.